ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు

- మన ఊరు–మన బడి పథకం ద్వారా నిధులు
- సమకూరుతున్న మౌలిక సౌకర్యాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఏపూరు పాఠశాలలో కొనసాగుతున్న తరగతి గదుల నిర్మాణం



డైనింగ్‌హాల్ నిర్మాణ పనులు

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల అభ్యున్నతి కోసం మన ఊరు– మన బడి కార్యక్రమం చేపట్టింది. మన ఊరు – మన బడి ద్వారా నిధులను సమకూర్చుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సౌకర్యాలు సమకూరుతున్నాయి.

నిధులు మంజూరు..

మండల పరిధిలోని ఏపూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా కోటి రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి రూ.77లక్షలు, డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరయ్యాయి. అదే విధంగా ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. వీటితోపాటు పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదులకు మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు వంటి పనులకు నిధులు విడుదలయ్యాయి.

తీరనున్న తరగతి గదుల కొరత..

మండలంలోని ఏపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కానీ వారికి సరిపోను తరగతి గదులు లేవు. దీనికి తోడు ప్రస్తుతం ఉన్న తరగతి గదులు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పాఠశాలకు మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా నిధులు మంజూరయ్యాయి. దీంతో నూతనంగా ఎనిమిది తరగతి గదుల నిర్మాణం కొనసాగుతోంది. పాత తరగతి గదులకు మరమ్మతులు కూడా జరుగుతున్నాయి. మధ్యాహ్న భోజనం చేసేందుకు విద్యార్థులకు రూ.20లక్షలతో డైనింగ్ హాల్ నిర్మిస్తున్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో రూ.25లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతోంది. మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలకు మౌలిక వసతులు సమకూరుతుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నూతనంగా ఎనిమిది తరగతి గదులు



మన ఊరు– మన బడి పథకంలో పాఠశాలకు 8 తరగతి గదులు మంజూరయ్యాయి. పాత తరగతి గదులకు మరమ్మతులు జరుగనున్నాయి. దీంతో విద్యార్థులకు తరగతి గదుల కొరత తీరనుంది. అలాగే డైనింగ్ హాల్, మరుగుదొడ్ల నిర్మాణాలు, తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు వంటి పనులు జరుగుతున్నాయి.

– శ్రీదేవి, ప్రధానోపాధ్యాయురాలు

12న ముగ్గులు, వంటల పోటీలు



కన్యకా పరమేశ్వరి ఆలయంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

భానుపురి : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న పట్టణంలోని మినీట్యాంక్ బండ్ వద్ద ముగ్గులు, వంటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ బెలిదె శ్రీనివాసులు, వాసవీ కపుల్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, వాసవీ క్లబ్ రీజనల్ చైర్మన్ కలకోట లక్ష్మయ్య తెలిపారు. మంగళవారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. పోటీల్లో విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ మీలా వాసుదేవ్, వాసవీ వనితా క్లబ్ ప్రెసిడెంట్ కలకోట అనిత, వాసవీ సుధాకర్ విజన్ క్లబ్ ప్రెసిడెంట్ పద్మ, వాసవీ కపుల్స్ క్లబ్ ప్రెసిడెంట్ సంతోష్, వాసవీ ఎన్ఆర్ఐ ఫ్యామిలీస్ క్లబ్ ప్రెసిడెంట్ పసుపర్తి కృష్ణమూర్తి, ఐపీసీ ఆఫీసర్ బిక్కుమళ్ల కృష్ణ, చల్లా లక్ష్మి, పసుపర్తి జ్యోతి, తల్లాడ శ్రీనివాస్, దాచేపల్లి సత్యనారాయణ, జూలకంటి నాగరాజు, భోనగిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వానరాలతో ప్రజల బెంబేలు

- గ్రామాల్లో పెరుగుతున్న కోతుల బెడద
- ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్న జనం



దోసపహాడ్‌లో పొలాల్లో సంచరిస్తున్న కోతులు

పెన్‌పహాడ్ : మండలంలో కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా సంచరిస్తున్నాయి. పంటలను కూడా పాడుచేస్తూ రైతులకు తీవ్ర నష్టం మిగుల్చుతున్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

ప్రతి గ్రామంలో..

మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రతి గ్రామపంచాయతీలో కోతుల బెడద తప్పడం లేదు. కోతులు వందకుపైగా సంఖ్యలో ప్రతి గ్రామంలో సంచరిస్తున్నాయి. మండలంలోని దోసపహాడ్, అనంతారం, అనాజీపురం, నారాయణగూడెం, నాగులపహాడ్, దూపహాడ్, లింగాల గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను సర్వనాశనం చేస్తున్నాయి. దీంతో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాల్లో కోతుల బెడద నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అడవుల్లో వదులుతాం

గ్రామాల్లో కోతులు ఉన్న మాట వాస్తవమే. అన్ని గ్రామపంచాయతీల సర్పంచ్‌లతో మాట్లాడి కోతులను పట్టుకొని అడవుల్లో వదిలేసేలా చర్యలు చేపడతాం. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– బాణాల శ్రీనివాస్, ఎంపీడీఓ

పంటలను ధ్వంసం చేస్తున్నాయి

గ్రామాల్లో కోతులు వందల సంఖ్యలో ఒకేసారి పంటలపై పడి ధ్వంసం చేస్తున్నాయి. కోతుల కాపలాకే అధికంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం కోతులను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలి.

– వెంకన్న, దోసపహాడ్

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్‌కు చెందిన జ్యోతి యువజన నాట్య కళామండలి సమాజ కమిటీ సహాయ కార్యదర్శి అద్దంకి ఆశీర్వాదం సతీమణి అద్దంకి రాణి ఇటీవల మృతిచెందారు. దీంతో జ్యోతి యువజన నాట్య కళామండలి సమాజ కళాకారులు మంగళవారం మృతురాలి కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంపల దావీదు, గురువు బాసంపెల్లి యాదగిరిగౌడ్, అధ్యక్షుడు వేల్పుల వెంకన్న, ఉపాధ్యక్షుడు బెల్లంకొండ యాదగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎడవెల్లి ముత్తయ్య, కోశాధికారి ఏలె నారాయణ, కార్యవర్గ సభ్యులు పందిరి కృష్ణారెడ్డి, పేరం బాలస్వామి పాల్గొన్నారు.

19న దొడ్డ నర్సయ్య వర్ధంతి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

తిరుమలగిరి : ఈ నెల 19న జరిగే తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ శాసన సభ్యుడు దొడ్డ నర్సయ్య వర్ధంతిని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం తిరుమలగిరి మండల మార్కెట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్లంల యాదగిరి, లక్ష్మయ్య, రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు పాల్వాయి పున్నయ్య, పాల్వాయి మల్లేష్ పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక

అర్వపల్లి : శ్రీలక్ష్మీనర్సింహస్వామి వాటర్‌ప్లాంట్‌ల అసోసియేషన్ మండల నూతన కమిటీని మంగళవారం అర్వపల్లిలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొట్టిపాక సైదులు, ఉపాధ్యక్షుడిగా గోళ్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా మామిడాల రాజలింగం, కోశాధికారిగా అంకిరెడ్డి సుదర్శన్, కార్యవర్గ సభ్యులుగా కట్టెల మల్లేష్, సాయిని మధు, పోలెపాక అర్జున్, కె. నాగరాజు, కె. రాజారామ్ ఎన్నికయ్యారు.

ట్రస్మా కమిటీ ఎన్నిక

సూర్యాపేటటౌన్ : తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కమిటీ మంగళవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా శేషగాని నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గుడిమళ్ల సంతోష్‌శర్మ, కోశాధికారిగా పిల్లల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా పేర్ల రమేష్, సహాయ కార్యదర్శిగా చిట్టెంకి కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నాయకులు మారం లింగారెడ్డి, తీగల ఉపేందర్‌రావు, పులుసు వెంకటేశ్వర్లు, కేఎస్ బ్రహ్మానందరెడ్డి, మద్రు హన్మంతరావు పాల్గొన్నారు.

తుంగతుర్తి జట్టుకు ప్రథమ బహుమతి



పోటీల్లో గెలుపొందిన తుంగతుర్తి జట్టు

తుంగతుర్తి : సూర్యాపేటలో మెమోరియల్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో తుంగతుర్తి కబడ్డీ జట్టు ప్రథమ బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా తుంగతుర్తి జట్టుకు రూ.20,000లతో పాటు, షీల్డ్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పీడీ కొండగడ్పుల యాకయ్య, సంతోష్, నాయకులు కటకం వెంకటేశ్వర్లు, పరమేష్, శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్ (ఎస్) : ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. ప్రగతిశీల యువజన సంఘం పిలుపులో భాగంగా మంగళవారం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో నిరసన తెలిపారు. రన్నింగ్‌లో పాసయిన అభ్యర్థులందరికీ మెయిన్స్ ఎగ్జామ్‌లో అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ మండల నాయకులు బయ్య వెంకన్న, లింగయ్య, గంగమ్మ, రామచంద్రు, సత్యం, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నూతనకల్ : డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య, క్రాంతికుమార్, అబ్రహం, ఆర్. సుధాకర్, సాహెబ్ అలీ, భిక్షం, వెంకటరమణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

అర్వపల్లి : వచ్చే ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌దే మళ్లీ విజయమని, మూడోసారి ఎమ్మెల్యేగా గాదరి కిశోర్‌కుమార్ ఎన్నిక కావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ అన్నారు. మంగళవారం గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కుంభం నాగరాజు, పున్న హరిప్రసాద్, కోటమర్తి మల్లయ్య, పెద్ది శ్రీను, కుంభం నాగరాజు, నిమ్మల యాదయ్య, నర్సింగ వెంకన్న, చింతల సురేష్, యాగానందం, లొడంగి నాగరాజు, రామ్మూర్తి, సోమయ్య, సందీప్, మహేష్, లింగమల్లు, సందీప్, శ్రీకాంత్, శ్రీరాములు, గండమల్ల ఎల్లేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నేడు పాటలు, డ్యాన్స్ పోటీలు

సూర్యాపేటక్రైం : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో పాటలు, నృత్యం పోటీలు నిర్వహిస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోటీల్లో పాల్గొనే యువత బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఎస్వీ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో పేర్లు నమోదు చేసుకొని పోటీల్లో పాల్గొనాలని సూచించారు. గెలుపొందిన వారికి జనవరి 12న ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

బడిబయట ఉన్న పిల్లల గుర్తింపు సర్వే



సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీలు

నూతనకల్ : బడిబయట ఉన్న పిల్లలను గుర్తించడం కోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం సీఆర్పీలు ఇంటింటి సర్వే నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పెద నెమిల, జాల్‌తండా గ్రామాల్లో ఈ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు బొడ్డుపల్లి జానకిరాములు, కనకం రవీందర్, తాడూరి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ పోస్టర్ల ఆవిష్కరణ



తిరుమలగిరి: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



తుంగతుర్తిలో..

అర్వపల్లి : హైదరాబాద్‌లో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్‌కే. సయ్యద్ కోరారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీలో విలేకరులతో మాట్లాడారు. 317 జీఓ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మహాసభలకు విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి, కేరళ రాష్ట్ర ఎమ్మెల్యే శైలజ, ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య తదితరులు హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు బి. వీరస్వామి, కె. శీనయ్య, విజిత, ఎన్. వెంకన్న, బాలాజీ పాల్గొన్నారు.

తుంగతుర్తి : హైదరాబాద్‌లో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు మల్లేపాక రవీందర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వేము రవీందర్‌రెడ్డి, రమేష్, నాగరాజు, శ్రీనివాస్, భాస్కర్, ఎల్లయ్య, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తిరుమలగిరి మండల శాఖ ఆధ్వర్యంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 5వ మహాసభల పోస్టర్లను, 2023 క్యాలెండర్లను మంగళవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఆ శాఖ అధ్యక్షుడు చల్లగుండ్ల సోమయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వీఎల్ఎన్ చార్యులు, జి.వీరునాయక్, కాటి వెంకన్న, ఎల్లయ్య, వీరన్న, రాజేశ్వరి, శ్రీనివాస్, రవీందర్, అన్నపూర్ణ, రాజు, లక్ష్మి, నర్సయ్య, పుల్లయ్య, యాదగిరి, సత్యనారాయణ, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కోశాధికారి జి.వెంకటయ్య, కేజీబీవీ ఎస్ఓ సరస్వతి అన్నారు. మంగళవారం ఆత్మకూరులో మహాసభల కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరుణాకర్‌రెడ్డి, చిలక రమేష్, జి.ధర్మయ్య, నాగమ్మ, లక్ష్మీప్రసన్న, స్నేహలత, సుమలత, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 5వ మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆ సంఘం మండల అధ్యక్షుడు రమావత్ రమేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 13, 14తేదీల్లో హైదరాబాద్‌లోని మన్నెగూడలో ఉన్న బీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగే మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి నాయిని గోపి, ఉపాధ్యాయులు వెంకన్న, మురళి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటమ్మ, ప్రియాంక, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 13, 14న హైదరాబాద్‌లోని మన్నెగూడెంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మైలారపు వెంకన్న, మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.రాంజీ, బండ్ల రమేష్, కె.గోపి, విజయ, కరుణశ్రీ, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మద్దిరాలలో..



ఆత్మకూరులో..



పెన్‌పహాడ్‌లో..

కంటి వెలుగుపై అవగాహన సమావేశాలు



తిరుమలగిరి : మాట్లాడుతున్న ఎంపీపీ



ఆత్మకూరులో..



అర్వపల్లిలో..

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18న నిర్వహించే 2వ విడత కంటి వెలుగు కార్యక్రమంపై మంగళవారం మున్సిపల్ కేంద్రంలో అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, పంచాయతీ సెక్రటరీలు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వీఆర్ఏలు, ఆర్పీలు, ఐకేపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్నేహలత మాట్లాడారు. ప్రజలందరికీ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందించాలని కోరారు. కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ తండు శ్రీను, డాక్టర్ మల్లెల వందన, ఎంపీఓ మారయ్య, సీహెచ్ఓ బిచ్చునాయక్, కౌన్సిలర్ బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18 నుంచి జూన్ 30 వరకు నిర్వహించే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మర్ల స్వర్ణలత చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు, నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ సర్వే నిర్వహించి కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించాలని, వారికి కంటి వైద్యపరీక్షలు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్ నాయక్, మండల వైద్యాధికారి వీరేంద్రనాథ్, ఎంపీఓ సంజీవయ్య, సర్పంచ్‌లు తంగెళ్ల వీరారెడ్డి, ములకలపల్లి రవి, సీహెచ్ఓ ఆవుల వెంకటేశ్వర్లు, టీఆర్ఎస్ జిల్లా నాయకుడు మర్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూడి నరసింహారావు, ఎంపీటీసీలు, జూనియర్ డాక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కంటి వెలుగుపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ఈనెల 18 నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీహరి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ కిరణ్, మండల వైద్యాధికారి నాగరాజు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ రాజేష్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

18నుంచి 'కంటి వెలుగు'

అర్వపల్లి : ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో కంటివెలుగు కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడేవారంతా గ్రామాల్లో నిర్వహించే క్యాంప్‌లలో పరీక్షలు చేయించుకొని ఉచితంగా అద్దాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ మహ్మద్ హర్షద్, సీహెచ్ఓ ఎల్. చరణ్, ఎంపీఓ సందీప్‌కుమార్, సర్పంచ్‌లు, కార్యదర్శులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

చివ్వెంల : పేదలకు అన్ని రకాల వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ ధరావత్ కుమారిబాబునాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అధికారుల, ప్రజాప్రతినిధుల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న చివ్వెంల, తిరుమలగిరి గ్రామాల్లో కంటి వైద్యపరీక్షలు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్. లక్ష్మి, వైద్యాధికారులు రాజ్‌కుమార్, సుషాంక్, కంటి వైద్యురాలు మంగా, ఎంపీఓ గోపి, ఏపీఎం రాంబాబు, హెల్త్ సూపర్‌వైజర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ నరేష్, వైద్యాధికారి స్రవంతి, ఎంపీటీసీ కొండేటి పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్



ఇసుక డంపులను సీజ్ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నూతనకల్ : యథేచ్ఛగా ఇసుక దందా అనే శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు ఇసుక డంపులను సీజ్ చేశారు. తాళ్లసింగారం గ్రామ శివారులోని పాలేరు వాగు వెంబడి అక్రమంగా డంపు చేసిన 302 ట్రాక్టర్ల ఇసుక టిప్పులను సీజ్ చేసి నోటీసులు పంపిణీ చేసినట్లు ఆర్ఐ కె. దేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు జహంగీర్, సతీష్ పాల్గొన్నారు.

కృష్ణాజలాల వాటా సాధనలో కేసీఆర్ విఫలం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

సూర్యాపేట : రాష్ట్ర విభజన అనంతరం కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాల సాధనలో సీకేసీఆర్ విఫలమయ్యాడని తెలంగాణ జనసమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు గట్ల రమాశంకర్ విమర్శించారు. ఈ నెల 11న హైదరాబాద్‌లో జరగనున్న కృష్ణానది జలదీక్షను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు మాంద్ర మల్లయ్యయాదవ్, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్‌కుమార్, లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ కుంచం చంద్రకాంత్, కోకన్వీనర్ వీరేశ్‌నాయక్, విద్యార్థి సమితి జిల్లా అధ్యక్షుడు వినయ్‌గౌడ్, సంపత్, రాజేష్ పాల్గొన్నారు.

వేదామృతం పేరును వ్యతిరేకించడం సరికాదు

దురాజ్‌పల్లి : స్వచ్ఛమైన ప్రకృతి పానీయం నీరాకు వేదామృతం పేరు పెట్టడాన్ని బ్రాహ్మణ సంఘాలు వ్యతిరేకించడం సరికాదని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నీరా కేఫ్ త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. ప్రకృతి సిద్ధంగా తాటి, ఈత చెట్ల నుంచి సూర్యరశ్మి రాకముందే తీసే స్వచ్ఛమైన పానీయాన్ని బాటిల్స్, ప్యాకెట్లలో నింపి వినియోగదారులకు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలుగురు గోవిందు, రాష్ట్ర కమిటీ సభ్యులు మడ్డి అంజిబాబు, గుణగంటి కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ ఇస్తారు, నోముల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు బోధనోపకరణలు అందజేత



తెలుగు బోధన సామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయుడు లింగమల్లు

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాక లింగమల్లు విద్యార్థులు తెలుగు సులభంగా నేర్చుకునేందుకు తాను సొంతంగా తయారు చేసిన టీఎల్ఎంను నాగారంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, ఉపాధ్యాయులు చక్రధర్, లక్ష్మణ్, సైదులు, మహేష్, సతీష్, కలింగం, వినయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో ఇళ్ల కూల్చివేత

చివ్వెంల : ఖమ్మం–సూర్యాపేట రోడ్డు విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం అధికారులు రహదారి పక్కన ఉన్న ఇళ్లను కూల్చి వేశారు. ఇప్పటికే వారికి నోటీసులు ఇచ్చి నష్టపరిహారం అందించారు. అలాగే మండల కేంద్రం నుంచి ఖాసీంపేటకు వెళ్లే రహదారి విస్తరణలో భాగంగా అడ్డుగా ఉన్న ఇళ్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, పంచాయతీరాజ్ ఏఈ లింగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి దూదియాతండా సర్పంచ్

చిలుకూరు : చిలుకూరు మండల పరిధిలోని దూదియాతండా గ్రామ సర్పంచ్ నందలాల్ మంగళవారం కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో సమన్వయంగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణచైతన్య, పార్టీ నాయకులు వాసు, సత్రాం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.